సాక్షి అనకాపల్లి

మంగళవారం । 19 । డిసెంబర్ । 2023



వేగంగా స్పందించండి

కలెక్టరేట్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 360 దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మా

8లో



సింహగిరిపై విశేష పూజలు

సింహాచలం: సింహగిరిపై సోమవారం ధనుర్మాస పూజల్లో భాగంగా గోదాదేవికి తిరువీధిని వైభవంగా నిర్వహించారు.



మన్యం వాతావరణమిలా..

సాక్షి, పాడేరు: జిల్లాలో అరకులోయలో 12, మినుములూరులో 13, చింతపల్లిలో 14.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

న్యూస్‌రీల్

సీఎం జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు



పార్టీ నేతలతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఈ నెల 21న సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. మునగపాకలోని పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మునగపాక నందీశ్వర తులసీ వేదికపై 21వ తేదీ సాయంత్రం 5గంటలకు బర్త్‌డే కేక్ కట్‌చేసి, 500 మంది పేదలకు చీరలు పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఏటా జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, పాలసంఘ అధ్యక్షుడు మళ్ల సంజీవరావు, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు, సచివాలయ కన్వీనర్లు టెక్కలి కొండలరావు, బొడ్డేడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ క్రీడామైదానానికి చేయూతనివ్వండి

- కేంద్రమంత్రికి ఎంపీ సత్యవతి వినతిపత్రం
- రూ.25 లక్షల విడుదలకు సానుకూల స్పందన



కేంద్ర మంత్రి శర్బానంద్ సోనోవాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానం అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని కోరుతూ కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ మంత్రి శర్బానంద్ సోనోవాల్‌కు ఎంపీ బి.వి.సత్యవతి వినతిపత్రం అందజేశారు. సోమవారం ఢిల్లీలో ఆమె కేంద్ర మంత్రిని కలిసి క్రీడా మైదానం అభివృద్ధి గురించి చర్చించారు. ఓడరేవులు, షిప్పింగ్ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.25 లక్షల నిధులు విడుదల చేసేందుకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్టు ఎంపీ తెలిపారు. నిధులను మైదానం అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు.

కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్‌కు ఎస్ కోటలో హాల్ట్

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఇచ్చిన హామీ మేరకు కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్‌కు శృంగవరపుకోటలో హాల్ట్‌ను కేటాయించేందుకు రైల్వే శాఖ సిద్ధమైంది. ఈ రైలు ఇరువైపులా రెండు నిమిషాలు ఎస్ కోటలో ఆగుతుంది. ఈ నెల 19వ తేదీ నుంచి విశాఖపట్నం–కిరండూల్(18514)నైట్ ఎక్స్‌ప్రెస్ **ప్రతీ రోజు రాత్రి** 10.08 గంటలకు ఎస్ కోట **చేరుకుని అక్కడ** నుంచి 10.10 గంటలకు **బయల్దేరుతుంది.** తిరుగు ప్రయాణంలో ఈ నెల **19వ తేదీన** కిరండూల్–విశాఖపట్నం(18513) **నైట్ ఎక్స్** ప్రెస్ ఎస్ కోటకు మధ్యరా**త్రి(20వ తేదీ)** 12.50 గంటలకు చేరుకుని, **అక్కడ నుంచి** 12.52 గంటలకు బయల్దేరుతుం**ది.**

అర్ధ సంవత్సర పరీక్షలు ప్రారంభం

యలమంచిలి రూరల్: జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ అర్ధ సంవత్సర పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యామండలి యంత్రాంగం రూపొందించిన ప్రశ్నపత్రాలతోనే విద్యార్థులందరికీ పరీక్షలు నిర్వహించేలా అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో సోమవారం మొదటి లాంగ్వేజ్ సబ్జెక్టులు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్షలు జరిగాయి. ఈ నెల 23 వరకు పరీక్షలు జరగనున్నాయి.

నేటి నుంచి తుపానులో నష్టపోయిన రైతుల జాబితా ప్రదర్శన

తుమ్మపాల: మిచాంగ్ తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతుల జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు ప్రదర్శించనున్నట్టు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి.ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు పంటనష్టాల వివరాలను పరిశీలించుకుని, సరిచేయించుకోవాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది పంటనష్టాల అంచనాల నమోదు పూర్తి చేసినట్టు తెలిపారు.

రైతు బాంధవులు

విలువైన పరిశోధనలు.. ఏళ్ల తరబడి సాగిన అధ్యయనంతో సాధించిన అద్భుత ఫలితాలు ఆర్ఏఆర్ఎస్ సొంతం. అధిక దిగుబడి సాధించే సరికొత్త వరి, చెరకు వంగడాలెన్నింటినో సృష్టించారు. చీడపీడల నుంచి.. వర్షాలు, వరదల వంటి ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలను ఎలా కాపాడుకోవాలో సూచనలందించారు. జీవన ఎరువుల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అంతేకాదు బెల్లం ఉత్పత్తులతో, చిరుధాన్యాలతో కొత్త కొత్త రుచులను పరిచయం చేశారు. ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు రైతులకు ఉపయుక్తమైన ఇలాంటి విలువైన సేవలెన్నో అందించారు.



ఆర్ఏఆర్ఎస్ పరిశోధన కేంద్రం

- పరిశోధనలతో అండగా ఉన్న ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు
- జన్యు శాస్త్రంలో 21 రకాల చెరకు, 15 రకాల వరి వంగడాల అభివృద్ధి
- నూతనంగా రూ.3.7 కోట్లతో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు
- 73 వేల ఎకరాలకు నూతన వరి వంగడాలు
- గత ఐదేళ్లుగా ద్రవ రూప జీవన్ ఎరువుల సరఫరా
- నేడు ఆర్ఏఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు



చెరకు పంటను పరిశీలిస్తున్న ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త



మోడరన్ జాగరి ప్లాంట్

సాక్షి, అనకాపల్లి: అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్) ప్రగతి పథంలో దూసుకుపోతోంది. పలు విలువైన పరిశోధనలతో రైతు బాంధవిగా ఆర్ఏఆర్ఎస్ నిలుస్తోంది. ఇక్కడి శాస్త్రవేత్తలు నిరంతరం రైతుకు అండగా నిలుస్తున్నారు. వ్యవసాయ వంగడాలను అభివృద్ధి చేయడం,, సేంద్రియ సాగుకు సరికొత్త విధానాలు తీసుకురావడం, చెరకు నుంచి బెల్లం తయారీ, బెల్లం ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతులు చేయడం వంటి వినూత్న విధానాలకు శ్రీకారం చుట్టారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల రైతులపై తుపాన్లు, అధిక వర్షాల ప్రభావం ఎంత మేర ఉంటుంది.. అప్పుడు పంటలను ఎలా కాపాడుకోవాలి తదితర విశేషాలను వివిధ మాధ్యమాల ద్వారా రైతులకు వివరిస్తున్నారు. 1913లో ప్రారంభమైన ఆర్ఏఆర్ఎస్ నేటికి 110 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఇది సుమారుగా 103 ఎకరాల్లో విస్తరించి ఉంది. అందులో 77 ఎకరాల్లో పంటల సాగు, పరిశోధనలు చేపడుతున్నారు. ఇది 1966 ఏడాది జూలై 1 నుంచి ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా పనిచేస్తోంది.

నూతన వంగడాల అభివృద్ధి

ఇక్కడ శాస్త్రవేత్తలు జన్యు శాస్త్రంలో 21 రకాల చెరకు, 15 రకాలకు పైగా వరి వంగడాలు అభివృద్ధి చేశారు. గత ఏడాది సుమారు 155 టన్నుల వరకు మేలైన చెరకు వంగడాలను స్థానిక రైతులకు, పంచదార కర్మగారాలకు అందించారు. అంతేకాకుండా ఒడిశా, తమిళనాడు లాంటి పొరుగు రాష్ట్రాలకు కూడా సరఫరా చేస్తున్నారు. వీటిలో ప్రధానమైనవి మధు, విశ్వామిత్ర, శారద, విశాఖ, కనకమహాలక్ష్మి, ఉత్తర, రేవతి, సింహాద్రి, శ్రీముఖి, వశిష్ఠ, నవీన్ వంటి వంగడాలు కాగా.. ఇటీవలే చెరకులో మంచి రస నాణ్యత కలిగి ఎరకుళ్ళు, కాటుక తెగులు రాకుండా ఉండేలా.. మన ప్రాంతాలకు అనువుగా ఉండి.. హెక్టారుకు 130 టన్నుల దిగుబడినిచ్చే 'అరుంధతి (2012ఏ 319)' అనే కొత్త వంగడాన్ని అభివృద్ధి చేశారు. కొత్తగా అభివృద్ధి చేసిన 2006 ఏ223, 2010 ఏ 229 వంటి రకాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

ఇవే కాకుండా, వరి పంటలో 406 క్వింటాళ్ల



స్టాల్లో ఆర్ఏఆర్ఎస్‌లో ఉత్పత్తులను వివరిస్తున్న శాస్త్రవేత్త జగన్నాథరావు

ఫౌండేషన్ వరి విత్తనం 1,350 ఎకరాలకు సరిపడా సరఫరా చేయడం జరిగింది. రాగి పంటలో పోషకాహారాలు ఎక్కువగా ఉన్న 'ఇంద్రావతి' అనే మేలు రకం విత్తనాన్ని 27 క్వింటాళ్ల వరకు 676 ఎకరాలకు సరిపడా విత్తనాన్ని అభివృద్ధి చేసి రైతులకు అందజేశారు.

జీవన ఎరువుల తయారీ కేంద్రాలు

రైతుకు తక్కువ ఖర్చుతో పాటు అధిక దిగుబడిని కల్పించే విధంగా జీవన ఎరువుల తయారీ కేంద్రాలను ఆర్ఏఆర్ఎస్ ఏర్పాటు చేసింది. పొడి, ద్రవ రూప జీవన ఎరువులు తయారీ కేంద్రాలను స్థాపించి అతి తక్కువ ధరలో నేలకు ప్రాణం పోసే జీవన ఎరువులను అన్ని రకాల పంటలకు ఉత్పత్తి చేస్తున్నారు. తక్కువ ఖర్చు..అధిక దిగుబడితో ప్రతీ రైతుకీ వీటిని అందుబాటులోనికి తీసుకురావాలనే దృఢ సంకల్పంతో ఆర్ఏఆర్ఎస్ కృషి చేస్తోంది. ఆర్ఏఆర్ఎస్‌లో ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీ వారు పొడి, ద్రవ రూప జీవన ఎరువుల తయారీ కేంద్రాలు స్థాపించి అతి తక్కువ ధరలో నత్రజని, భాస్వరం, పొటాషియం జీవన ఎరువులను ఉత్పత్తి చేసి రైతులకు అందిస్తున్నారు. గత ఐదేళ్లుగా సుమారు 40,650 కిలోల పొడి జీవన ఎరువులు, 27,500 లీటర్ల ద్రవ రూప జీవన ఎరువులను తయారుచేసి రాష్ట్రవ్యాప్తంగా 75 వేల ఎకరాలకు అందించారు. వీటితో పాటుగా కీటక శాస్త్ర విభాగంలో జీవ నియంత్రణ పద్ధతులపై విస్తృత పరిశోధనలు జరపడం, మొక్కజొన్నలో కత్తెర పురుగును ఈ ప్రాంతంలో మొదటిసారిగా గుర్తించడం, కొబ్బరిలో సర్పిలాకార తెల్ల దోమ పురుగును గుర్తించి నియంత్రణ విధానాలు, జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా ప్రాచుర్యంలోకి తీసుకురావడం వీరి ప్రత్యేకతలు. పంటల్లో చీడపీడలను నివారించేందుకు రసాయనిక పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో పంటలకు మేలు చేసే మందులను అందించారు.

ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు

రూ.3.5 కోట్లతో ఆర్ఏఆర్ఎస్‌లో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేసి వ్యవసాయ ఉత్పత్తులతో పాటు వాటి ఉప ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు, రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. చెరకు ప్రాసెసింగ్ లైన్లు (ఘన బెల్లం, పొడి బెల్లం, బెల్లం ఆధారిత ఉత్పత్తులు, బెల్లం జొన్న బిస్కెట్లు, బెల్లం జెల్లీలు, చెక్కీలు), చిరుధాన్యాల ప్రాసెసింగ్ లైన్లు (చిరుధాన్యాల పిండి, పోషక బార్, మల్టీ మిల్లెట్, చిరుధాన్యాల అటుకులు), పనస ప్రాసెసింగ్ లైన్లు (పనస జామ్, ఉడికించడానికి సిద్ధంగా ఉన్న లేతపనస) వంటివి ఎగుమతి చేస్తున్నారు.

బెల్లం నాణ్యతను పెంచడంలో పరిశోధన చెప్పుకోదగ్గది. ఇవే కాకుండా బెల్లంపై విలువ ఆధారిత పరిశోధనలో వివిధ రూపాల్లో బెల్లాన్ని తయారు చేయడం కనిపెట్టారు. పొడి రూపంలో ఎక్కువ రోజులు నిల్వ ఉండేలా బెల్లాన్ని తయారుచేసే పరిశోధనలు విజయవంతం అయ్యాయి. దేశంలోనే రెండో అధునాతన బెల్లం తయారీ ప్లాంటుగా 'నవీన బెల్లం ప్లాంటు'ను అభివృద్ధి చేశారు. ఇక్కడ రోజుకు టన్ను బెల్లాన్ని, 1500 లీటర్ల బెల్లం పాకాన్ని, 800 కిలోల బెల్లం పొడిని తయారు చేయవచ్చు. అంతేకాకుండా బెల్లం రసంలో అల్లం, నిమ్మ రసం కలిపి పౌడరు తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు.



విలువ ఆధారిత ఉత్పత్తులు

రూ.35 వేల విలువైన పూతరేకుల యంత్రం

ఆంధ్ర సంప్రదాయ మిఠాయి వంటకాల్లో పూతరేకులది అగ్రస్థానం. ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు పూతరేకుల తయారీ మెషీన్‌ను రూపొందించారు. సాధారణంగా రోజుకు 650 పూతరేకులను తయారు చేయగలరు. ఈ మిషన్‌తో 1200 వరకు చేయవచ్చు. దీనిని 2016లో ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు తయారు చేశారు. దీని ఖరీదు రూ.35 వేలు. పేటెంట్ హక్కులు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఉన్నాయి. వీరు తయారు చేసిన మెషీన్‌ను పూతరేకుల తయారీలో పేరెన్నికగన్న ఆత్రేయపురంలో కూడా అమ్ముకునే విధంగా శాస్త్రవేత్తలు అనుమతులు పొందారు.

రైతు బాంధవులం..



పంటల యాజమాన్య విభాగంలో అధిక దిగుబడులు సాధించడానికి కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నాం. ఇటీవల మిచాంగ్ తుపాను కారణంగా వర్షాలు కురిసినప్పుడు మా శాస్త్రవేత్తల బృందం పంటను రక్షించుకునేలా అవగాహన కల్పించింది. ఒకవైపు రైతుకు అండగా ఉంటూ.. మరోవైపు తన పరిశోధనలతో దేశ విదేశాల్లో ఆర్ఏఆర్ఎస్ పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చింది. రైతులకు యంత్రాలను రూపొందించి అద్దెకు ఇవ్వడం, బెల్లం, మిల్లెట్ ఆధారిత ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేస్తూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నాం.

–పి.వి.కె జగన్నాథరావు, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త

ఆరోగ్య శ్రీపై అందరికీ అవగాహన అవసరం

- యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి
- కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి



సీఎం ప్రసంగం ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకిస్తున్న కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, ఎస్పీ కె.వి.మురళీకృష్ణ, ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్, ఎంపీపీ గొర్లి సూరిబాబు

తుమ్మపాల: ఆరోగ్యశ్రీ పథకం పై అందరూ అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి తెలిపారు. పేదవాడికి ఆరోగ్య శ్రీని మరింత చేరువ చేసే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సోమవారం తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని ఎస్పీ కె.వి.మురళీకృష్ణతో కలిసి కలెక్టర్ తిలకించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కుటుంబంలో అందరూ తప్పని సరిగా ఆరోగ్యశ్రీ యాప్‌ను తమ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో ఇకనుంచి రూ.25 లక్షల వరకు చికిత్స పొందవచ్చని చెప్పారు. ఇప్పుడు ఆరోగ్య శ్రీ ద్వారా కేన్సర్, గుండె శస్త్ర చికిత్సలు కూడా చేస్తున్నట్టు చెప్పారు. ఆరోగ్యశ్రీలో ఉచితంగా వైద్యం పొందడం సులభతరమైందని, 104 కాల్‌సెంటర్, హెల్త్ క్లినిక్, **ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ఆరోగ్యశ్రీ సేవల గురించి** తెలుసుకోవచ్చని తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేస్తారని చెప్పారు. ఆరోగ్యశ్రీ కార్డును స్మార్ట్ కార్డుగా రూపొందించినట్టు తెలిపారు. ప్రభుత్వం ఇప్పుడు ఆరోగ్య ఆసరా పథకాన్ని కూడా ప్రారంభిస్తుందని, ఆరోగ్యశ్రీ పథకంలో వైద్యం పొంది డిశ్చార్జ్ అయిన తరువాత విశ్రాంతి సమయంలో జీవనోపాధి కోల్పోయే పరిస్థితి కలగకుండా ఉండేందుకు రూ.5వేల వరకు ఆర్థికసాయాన్ని అందిస్తారని చెప్పారు. ఈ పథకంలో 1,519 రకాల చికిత్సలకు సహాయం అందుతుందన్నారు. **ఆరోగ్యశ్రీ సేవలు సంతృప్తికరంగా లేకపోయినట్ట**యితే ఫిర్యాదు చేసే అవకాశాన్ని కూడా కల్పించారని తెలిపారు. వైద్యం పొందే సమయంలో ఆరోగ్య మిత్ర గానీ, ఆస్పత్రి సిబ్బంది గానీ, మరెవరైనా లంచం అడిగితే 14400 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. అంతకుముందు ఆరోగ్యశ్రీ సేవలను గూర్చి తెలియజేసే పోస్టర్‌ను విడుదల చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్, గ్రామవార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజులవాణి, డీఎల్‌వో డాక్టర్ బాలాజీ, డీఎస్ఎంవో డాక్టర్ కిషోర్‌కుమార్, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, అనకాపల్లి ఎంపీపీ గొర్లి **సూరిబాబు పాల్గొన్నారు.**

రెండేళ్లకే నూరేళ్లు

- బస్సులో కన్నుమూసిన బిడ్డ
- తల్లడిల్లిన తల్లి హృదయం



కుమారుడి మృతదేహాన్ని పట్టుకొని రోదిస్తున్న తల్లి

యలమంచిలి/యలమంచిలి రూరల్: ఏ వ్యాధి సోకిందో? ఏం జరిగిందో తెలీదు కానీ.. తల్లితో కలిసి బస్సులో ప్రయాణిస్తున్న రెండేళ్ల బాబు అస్వస్థతకు లోనయ్యాడు. ఆస్పత్రికి తీసుకొచ్చేసరికే ప్రాణాలు కోల్పోయాడు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న బిడ్డకు తన చేతుల్లోనే నూరేళ్లు నిండిపోవడంతో ఆ తల్లి తల్లడిల్లిపోయింది. విగతజీవిగా మారిన పసిబిడ్డను పట్టుకుని తల్లి కన్నీరుమున్నీరుగా విలపించడం అందరినీ కలచివేసింది. యలమంచిలి ప్రభుత్వాస్పత్రి వద్ద సోమవారం రాత్రి 10 గంటల సమయంలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది తెలియజేసిన వివరాలు.. ఎస్.రాయవరం మండలం పెనుగొల్లులో నివాసముంటున్న కర్రి కుమారి రెండేళ్ల కుమారుడు చెర్రీ కొంతకాలంగా తీవ్రమైన దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడు. సోమవారం విశాఖ నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సకు తీసుకెళ్లి బస్సులో పెనుగొల్లు వస్తుండగా యలమంచిలి సమీపాన శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడ్డాడు. తల్లి కుమారి తన బిడ్డను ఎలాగైనా బతికించుకోవాలన్న తాపత్రయంతో యలమంచిలిలో బస్సు దిగి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లింది. అయితే అప్పటికే చెర్రీ మృతి చెందినట్టు డ్యూటీ డాక్టర్ సుభాష్ ధ్రువీకరించారు. ఎన్నో కష్టాలు పడుతూ బిడ్డకు చికిత్స చేయించినా రెండేళ్లకే నూరేళ్లు నిండిపోయాయని తల్లి కుమారి గుండెలు బాదుకుంటూ విలపించింది. తన కొడుకుని బతికించమని వేడుకుంటూ చూపరులను కంటతడి పెట్టించింది. మృతి చెందిన చెర్రీ తండ్రి తాతాజీ పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. భార్య కుమారితో విభేదాల కారణంగా కొంతకాలంగా వేర్వేరుగా ఉంటున్నారు. తండ్రి వచ్చేవరకూ చెర్రీ మృతదేహాన్ని తీసుకెళ్లడానికి కుదరదంటూ భర్త తరపు వారు ఆస్పత్రి వద్ద భార్య, ఆమె కుటుంబీకులతో వాగ్వాదానికి దిగారు. కారులో మృతదేహం తరలింపును అడ్డుకున్నారు.

నెట్‌వర్క్.. పర్‌ఫెక్ట్

- విశాఖ సర్కిల్ పరిధిలో నెట్‌వర్క్‌ను సమగ్రాభివృద్ధి చేస్తున్న ఈపీడీసీఎల్
- హుద్‌హుద్ సమయంలో విశాఖలో 70 శాతం దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ
- రూ.400 కోట్లు ఖర్చు చేసి కేవలం తాత్కాలిక పనులు నిర్వహించిన టీడీపీ ప్రభుత్వం
- హడావుడిగా లైన్ల పునరుద్ధరణతో తరచూ సరఫరాకు ఇబ్బందులు
- మూడేళ్లుగా ఒక్కో ప్రాంతం నెట్‌వర్క్‌ను సరిదిద్దుతూ శాశ్వత పరిష్కార పనులు

సాక్షి, విశాఖపట్నం : సాధారణంగా అమెరికాలో తుపాను కారణంగా విద్యుత్ వ్యవస్థ దెబ్బతింటే 15 రోజుల సమయమైనా తీసుకొని శాశ్వత పనులు నిర్వహిస్తారు. కానీ హుద్‌హుద్ సమయంలో అప్పటి సీఎం చంద్రబాబు ప్రచార ఆర్భాటంతో ముందుచూపు లేకుండా వారం రోజుల్లోనే విద్యుత్ పునరుద్ధరించాలంటూ రూ.400 కోట్లతో చేపట్టిన తాత్కాలిక పనులతో ఈపీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిపోయింది. ఈ క్రమంలో అనేక ప్రమాదాలు కూడా ప్రజల జీవితాల్ని ఛిన్నాభిన్నం చేసేశాయి. టీడీపీ చేసిన హడావుడి తప్పిదాల్ని సరిదిద్దుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రక్షాళన దిశగా చర్యలకు ఉపక్రమించింది. మూడేళ్లుగా ఒక్కో ప్రాంత నెట్‌వ**ర్క్‌ను సరిచేస్తూ విశాఖ సర్కిల్ పరిధిలో శాశ్వత పరిష్కార పనులను నిర్వహిస్తోంది.**

హడావుడిగా లైన్ల పునరుద్ధరణతో..

హుద్‌హుద్ విపత్తు కారణంగా విశాఖ సర్కిల్ పరిధిలో దాదాపు 40 వేల వరకూ విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. 44 సబ్‌స్టేషన్లు ధ్వంసమయ్యాయి. మొత్తంగా 70 శాతానికి పైగా విద్యుత్ వ్యవస్థ దెబ్బతింది. మొత్తం రూ.120 కోట్లు వరకూ నష్టం వాటిల్లింది. విద్యుత్ వైర్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు మార్పు కోసం దాదాపు రూ.600 కోట్లు ఖర్చు చేశారు. వేలమంది కాంట్రాక్టు కూలీలతో స్తంభాల మార్పు పనులు చేపట్టారు. తాత్కాలిక పనులు చేసి సరఫరా ఇవ్వాలంటూ అధికారులకు చంద్రబాబు హుకుం జారీ చేయడంతో యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. స్తంభాల ఏర్పాటు కూడా హడావిడిగా చేశారు. సాధారణంగా ఒక పోల్‌ని నిలబెట్టేటప్పుడు పోల్‌లో 1/6వ వంతు భూమిలోపల ఉండేలా చూసుకోవాలి. అదేవిధంగా ప్రతి 10వ పోల్, కర్వ్‌డ్ ఏరియాలోనూ ఆ పోల్‌ని కాంక్రీట్‌తో కప్పాలి. ఇవేమీ చేయకుండానే పనులు నిర్వహించేశారు. ఈ కారణంగా విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిపోయింది.

ప్రాణాలు తీసిన టీడీపీ ప్రచార ఆర్భాటం

తాత్కాలిక పనులు చేపట్టిన తర్వాత టీడీపీ

ప్రమాదాలు తగ్గాయిలా..	
సంవత్సరం	జరిగిన ప్రమాదాలు
2017-18	68
2018-19	46
2019-20	24
2020-21	44
2021-22	33
2022-23	37
2023-24	18

తప్పిదాల్ని సరిదిద్దుతూ...

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ వ్యవస్థ ప్రక్షాళన దిశగా అడుగులు వేసింది. విశాఖలో జరుగుతున్న ప్రమాదాలు, తలెత్తుతున్న అంతరాయాలపై దృష్టిసారించాలని సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్పెషల్ సీఎస్ విజయానంద్ ఆధ్వర్యంలో సీఎండీల నుంచి డిప్యూటీ ఈఈల వరకూ క్షేత్రస్థాయి సమావేశాలు నిర్వహించగా.. వీటన్నింటికీ కారణం.. హుద్‌హుద్ సమయంలో చేసిన తప్పిదాలని గుర్తించారు. వీలైనంత త్వరగా పునరుద్ధరణ పనులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. అప్పటి నుంచి విశాఖ సర్కిల్ పరిధిలో పనులు జోరందుకున్నాయి. ఒక్కో స్తంభాన్ని, కండక్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మార్చుకుంటూ శాశ్వత పనులు చేపడుతూ సరఫరా వ్యవస్థని బలోపేతం చేస్తున్నారు. ఈ కారణంగా ప్రమాదాలు తగ్గుతూ వస్తున్నాయి. 2019-20లో కేవలం 24 ప్రమాదాలు మాత్రమే జరిగాయి. 2021-22లో 33, 2023-24లో 18 ప్రమాదాలు మాత్రమే సంభవించాయి. ఇప్పటివరకు 20 వేలకు పైగా స్తంభాల్ని మార్చారు.



సరఫరాలో నాణ్యత పెరిగింది



ఈపీడీసీఎల్‌లోని విశాఖ సర్కిల్ పరిధిలో విద్యుత్ నెట్‌వర్క్‌ను దశలవారీగా పునరుద్ధరిస్తున్నాం. 20 వేలకు పైగా కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశాం. కొత్త కండక్టర్లను అమర్చాం. 33 కేవీ, 11 కేవీ లైన్లు ఇప్పటికే చాలా మార్పు చేశాం. ఫలితంగా సరఫరాలో నాణ్యత పెరిగింది. అంతరాయాలు దాదాపు తగ్గుముఖం పట్టాయి. ప్రాంతాల వారీగా పనులు నిర్వహిస్తున్నాం. అందుకే విద్యుత్ సరఫరా గణనకు సంబంధించిన సిస్టమ్ యావరేజ్ ఇంట్రప్షన్ డ్యూరేషన్ ఇండెక్స్(సైడీ), సిస్టమ్ యావరేజ్ ఇంట్రప్షన్ ఫ్రీక్వెన్సీ ఇండెక్స్(సైఫీ)లో నంబర్‌వన్‌గా నిలుస్తూ వస్తున్నాం. 2014–19 మధ్య కాలంతో పోల్చితే సర్కిల్ పరిధిలో వినూత్న మార్పులు చోటుచేసుకున్నాయి. ఆ కాలంలో రోజుకు

ఇప్పటివరకు 33కేవీ, 11కేవీ విద్యుత్ వ్యవస్థ పరిధిలో చేపట్టిన శాశ్వత పనులు
దెబ్బతిన్న పోల్స్ స్థానంలో వేసిన కొత్త పోల్స్ 8,086
నేలకొరిగిన పోల్స్ స్థానంలో వేసిన కొత్త పోల్స్ 7661
చిన్న పోల్స్ స్థానంలో కొత్త వేసిన కొత్త పోల్స్ 1597
పోల్స్ మధ్య దూరం ఉంటే వాటి మధ్యలో వేసిన కొత్త స్తంభాలు 3,336
రోడ్ క్రాసింగ్స్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన హైట్ పోల్స్ 1312
సపోర్ట్ వైర్లు ఏర్పాటు చేసిన చేసిన ప్రాంతాలు 11,331
కొత్తగా ఏర్పాటు చేసిన కండక్టర్లు 867 కిలోమీటర్లు
ప్రమాదాలు జరగకుండా గార్డులు ఏర్పాటు చేసిన ప్రాంతాలు 1271
ఇప్పటివరకు ఖర్చు చేసిన మొత్తం నిధులు రూ.68.50 కోట్లు

ఎస్పీ కార్యాలయంలో స్పందనకు 45 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కె.వి.మురళీకృష్ణ

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందనకు 45 అర్జీలు వచ్చాయి. ఈ మేరకు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అర్జీదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటూ చట్టపరిధిలో వాటిపై దిగువస్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూతగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ వంటివాటిపై అర్జీలు అధికంగా వచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు, ఎస్ఐ బి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం, అనకాపల్లి

కమర్షియల్ షాపుల బహిరంగ వేలం ప్రకటన

ఆర్.సి. నెం.88/2013 తేది.19.12.2023

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా వ్యవసాయ మార్కెట్ కమిటీ, అనకాపల్లి డా॥ ఎన్.టి.ఆర్. మార్కెట్ యార్డుకు పశ్చిమ దిశగా నిర్మించిన కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ నందు షాపు నెం. 13, 18, 23, 33, 34 & 39 షాపులను రెండు సంవత్సరములకు అద్దె ప్రాతిపదికపై కేటాయించుటకు గాను సీల్డు టెండర్లు తేది. 28-12-2023న మ. 3-00 గంటలలోగా ఈ కార్యాలయము టెండరు బాక్సు నందు వేయవలెను. సదరు టెండర్లను తేది. 29-12-2023న ఉ.11-00 గంటలకు అప్పటికి హాజరగు టెండరుదారుల సమక్షములో తెరువబడును.

వ.నెం.	షాపు నెం.	రిజర్వేషన్
1.	13	ఓ.సి.
2.	18	ఎస్.సి
3.	23	ఓ.సి.(మహిళ)
4.	33	బి.సి.-డి (మహిళ)
5.	34	బి.సి.-ఇ (మహిళ)
6.	39	బి.సి.-ఏ (మహిళ)

పైన తెలిపిన షాపులను రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారము కేటాయించడం జరుగును. ఒక వేళ SC అభ్యర్థులు బహిరంగ వేలములో పాల్గొనని యెడల, బహిరంగ వేలములో పాల్గొనుటకు వచ్చిన మిగతా వారికి కేటాయించబడును. బహిరంగ వేలంలో పాల్గొను SC మరియు BC అభ్యర్థులు MRO వద్ద నుండి కులానికి సంబంధించిన సర్టిఫికెట్ ఋజువుగా తీసుకురావలెను.

టెండరు షెడ్యూలు కావలసిన వారు రూ. 300/-లు చెల్లించి తేది. 20-12-2023 నుండి తేది. 27-12-2023 సా॥ 4.00 గంటల వరకు ఈ కార్యాలయము పని వేళలయందు పొందవచ్చును. టెండరు షెడ్యూలును పోస్టు ద్వారా పంపబడవు. బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు రూ. 30,000/- (అక్షరములా ముప్పై వేల రూపాయలు)లు డిపాజిట్‌ను Selection Grade Secretary, Agricultural Market Committee, Anakapalli వారి పేరున డిడిని టెండరు షెడ్యూలుతో జతపరిచి తేది. 28-12-2023 సాయంత్రం 3-00 గంటలలోగా టెండరు బాక్సు నందు వేయవలెను.

ఇతర వివరముల కొరకు ఈ కార్యాలయము పనిదినముల యందు సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి వ్యవసాయ మార్కెట్ కమిటీ, అనకాపల్లి వారిని సంప్రదించవలెను.

అధ్యక్షులు
వ్యవసాయ మార్కెట్ కమిటీ, అనకాపల్లి

స్పందన అర్జీలపై వేగంగా స్పందించండి



అర్జీలదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, జేసీ ఎం.జాహ్నవి

తుమ్మపాల : స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలలో తిరస్కరించిన వాటిలో అందుకు గల కారణాలను అర్జీదారునికి స్పష్టంగా తెలియజేయాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి దరఖాస్తులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన అర్జీలను వేగంగా పరిష్కరించాలన్నారు. నేరుగా, ఆన్‌లైన్‌లో వచ్చే స్పందన ఫిర్యాదులపై కొన్ని స్పష్టత లేకుండా తిరస్కరణకు గురవుతున్నాయని, వాటికి గల కారణాలను తెలియజేసే విధంగా అధికారులు ఉండాలన్నారు. 12 శిబిరాల ద్వారా మొత్తం 360 దరఖాస్తులు వచ్చాయి. ముఖ్యంగా భూ సమస్యలు, రేషన్ కార్డుల కోసం అర్జీలు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, గ్రామవార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజులవాణి దరఖాస్తులను స్వీకరించారు. స్పందనలో పలువురు అందించిన ఫిర్యాదుల వివరాలు ఇలా ఉన్నాయి.

- ప్రభుత్వం అగ్రిగోల్డ్ ఆస్తులను స్వాధీనం చేసుకొని, కోర్టులు, కేసులతో సంబంధం లేకుండా బాధితులకు డిపాజిట్లు చెల్లించాలని అగ్రిగోల్డ్ బాధితులు కలెక్టర్‌ను కోరారు.

మురుగునీటి సమస్యపై ఫిర్యాదు

గ్రామంలో మురుగునీటి కాలువలకు మరమ్మతులు చేపట్టి శుభ్రం చేయాలని కోరుతూ కశింకోట మండలం కొత్త అచ్చెర్ల గ్రామానిక చెందిన నిమ్మదల సురేష్‌కుమార్ స్పందనలో వినతి అందించారు. కాలువల్లో పూడిక తీయకపోవడం వల్ల ఇటీవల కురిసిన వర్షాలకు మురుగునీరు ఇళ్ల మధ్య నిలిచిపోయిందని, సచివాలయం సిబ్బందికి తెలియజేసినప్పటికి పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు.

పరిశ్రమల వ్యర్థాల నుంచి కాపాడండి...

పాయకరావుపేట : కాకినాడ జిల్లా తొండంగి మండలం, పెరుమాళ్ళపురం ఏరియాలో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలకు సంబంధించిన వ్యర్థ జలాలను పాయకరావుపేట మండలంలో గల వెంకటనగరం, రాజానగరం సముద్రతీరంలో వేయడాన్ని అధికారులు నిలిపివేయాలని తీరప్రాంత గ్రామాల నాయకులు అనకాపల్లి జిల్లా కలెక్టరు కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఇప్పటికే స్థానికంగా గల పరిశ్రమల వ్యర్థాలను సముద్రంలోనికి విడుదల చేయడం వల్ల చేపలు చనిపోయి, మత్స్యకారుల జీవనానికి ఇబ్బంది కలుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, పాల్మన్‌పేట సర్పంచ్ కోటేశ్వరరావు, చేపల నాగమణి, అప్పలరాజు, గోవిందమ్మ, వంకా కృష్ణ పాల్గొన్నారు.

మూడు రోడ్ల నిర్మాణానికి రూ. 6.2 కోట్లు

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



చోడవరం: నియోజకవర్గంలో మూడు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్టు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో ఖ్వాజా మొహిద్దీన్ చిస్తీ దర్గాను దర్శించుకోవడానికి వెళ్లిన ఆయన సోమవారం ఫోన్‌లో స్థానిక విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో దెబ్బతిన్న పలు రోడ్లను ఇప్పటికే బాగుచేసినట్టు చెప్పారు. తాజాగా మూడు రోడ్ల నిర్మాణానికి సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేశారని తెలిపారు. అడ్డూరు నుంచి లింగాలతిరుగుడు వరకు, వడ్డాది హైస్కూల్ నుంచి బంగారుమెట్ట, లోపూడి వరకు, ఎలంకాయల పాలెం నుంచి చెట్టుపల్లి వరకు రోడ్లు మంజూరైనట్టు చెప్పారు. ఈ రోడ్ల నిర్మాణానికి రూ.6.20 కోట్లు మంజూరైనట్టు ధర్మశ్రీ తెలిపారు. టెండర్లు పిలిచి నెలరోజుల్లోగా నిర్మాణాలు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. నియోజవర్గంలో బీఎస్ రోడ్డు మినహాయించి అన్ని లింకురోడ్లు పూర్తిగా నిర్మించామన్నారు. బీఎస్‌రోడ్డు పనులు కూడా వేగంగా చేయించాలని ప్రభుత్వాన్ని కోరామని, ఆ పనులు కూడా పూర్తవుతాయని ధర్మశ్రీ చెప్పారు.

కలెక్టరేట్‌లో డేటా ప్రాసెసింగ్ సెంటర్

తుమ్మపాల: కలెక్టరేట్‌లో భూముల సర్వే, భూమి రికార్డుల శాఖ డేటా ప్రాసెసింగ్ సెంటర్‌ను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సోమవారం ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. డేటా ప్రాసెసింగ్ సెంటర్ ద్వారా జగనన్న భూహక్కు భూరక్ష రీసర్వేలో గుర్తించిన గ్రామ, సర్వే నంబర్ సరిహద్దులను అక్షాంశ రేఖాంశాలతో సాఫ్ట్‌వేర్ రూపంలో పొందుపరుస్తారని ఏడీ ఎస్.గోపాలరాజు తెలిపారు. క్యూఆర్ కోడ్‌తో సహా భూ పట్టాలను అందించడం జరుగుతుందన్నారు.



డేటా ప్రాసెసింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

కమనీయంగా సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణోత్సవం



సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు



కల్యాణోత్సవంలో భక్తులు

చోడవరం: సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం సోమవారం కనుల పండువగా జరిగింది. ప్రఖ్యాతి గాంచిన చోడవరం స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని ఉపాలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా చేశారు. సుబ్రహ్మణ్య షష్టిని పురస్కరించుకొని పండితుల వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామివారి కల్యాణం ఎంతో ఘనంగా చేశారు. భక్తులు ఉదయం నుంచి స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం ప్రత్యేక వాహనంపై స్వామివారి తిరువీధోత్సవం చేశారు.

పొక్లెయిన్‌కు నిప్పంటించిన దుండగులు

మునగపాక : పాటిపల్లి మోడల్ స్కూల్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి పొక్లెయిన్‌కు నిప్పంటించారు. దీంతో రూ.2 కోట్లకు పైగా నష్టం సంభవించి ఉంటుందని అంచనా వేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. మోడల్ స్కూల్ సమీపంలో ప్రభుత్వ అనుమతితో వ్యాపారులు గ్రావెల్ తవ్వకాలను ఇటీవల ప్రారంభించారు. ఏం జరిగిందో తెలియదు పొక్లెయిన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి పెట్రోల్ పోసి తగులబెట్టారు. విషయం తెలుసుకున్న యలమంచిలి సీఐ గఫూర్, ఎస్ఐ మహమ్మద్ అలీ సంఘటనా స్థలానికి సోమవారం చేరుకొని కాలిపోయిన పొక్లెయిన్‌ను పరిశీలించారు. అలాగే క్లూస్ టీమ్‌ను కూడా రప్పించి వివరాలు సేకరిస్తున్నారు.

పాడి రైతుల స్కీమ్‌లపై అవగాహన సదస్సు నేడు

అనకాపల్లి: జాతీయ పాడి రైతుల జిల్లా స్థాయి అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించనున్నట్టు పశుసంవర్ధకశాఖ ఏడీ ఎం.సౌజన్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గవరపాలెం నూకాంబిక అమ్మవారి రహదారిలోని శ్రీ సత్యలక్ష్మి ఫంక్షన్ హాల్లో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న సదస్సులో భాగంగా పలు స్టాళ్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొంటారని తెలిపారు.

బాడీ బిల్డింగ్ పోటీల విజేత భాస్కర్



విజేత జి.భాస్కర్‌కు మెమెంటో, నగదు, అందజేస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లి: క్రీడల్లో నేటి ఓటమి రేపటి గెలుపుకు నాంది పలుకుతుందని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక గవరపాలెం వి.వి.రమణరైతు భారతి ఆడిటోరియంలో రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీలు(మిస్టర్ ఆంధ్రా-2023) ముగింపు కార్యక్రమం ఆదివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉమ్మడి జిల్లా క్రీడలకు పుట్టినిల్లు అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకోటలో వేలాది మంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అనంతరం మిస్టర్ ఆంధ్ర-2023 విజేతగా విశాఖకు చెందిన జి.భాస్కర్‌కు, రన్నర్‌గా కర్నూలుకు చెందిన కె.సుధీర్‌కు రూ. 25వేలు, 10వేలు నగదు ప్రోత్సాహం, మెమెంటో, సర్టిఫికెట్‌ను రత్నాకర్ అందజేశారు. అంతకు ముందు నేషనల్ బాడీ బిల్డర్ శిలపరశెట్టి బాబీని రత్నాకర్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఒలింపిక్ క్రీడాకారుడు మాణిక్యాలు, 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల బాస్కర్, ఎస్‌డీ గ్రూప్ అధినేత కాండ్రేగుల శ్రీరామ్, వ్యాపారవేత్తలు ముప్పన సుబ్రహ్మణ్యం, విల్లూరి శ్రీనివాసరావు, అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు అమరపల్లి కృష్ణాజీ, సభ్యులు కాండ్రేగుల అజయ్, దొడ్డి సంతోష్, మళ్ల రామచంద్రరావు, వివిధ జిల్లాల బాడీబిల్డర్స్ పాల్గొన్నారు.



రజత పతకం సాధించిన మర్రా రామ్

బాడీ బిల్డింగ్ పోటీల్లో సత్తాచాటిన రామ్

నర్సీపట్నం : అనకాపల్లి బాడీ బిల్డర్స్, ఫిట్నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న అనకాపల్లి వి.వి.రమణ రైతు భారతి ఆడిటోరియంలో ఏపీ 6వ బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నర్సీపట్నానికి చెందిన మర్రా రామ్‌కీ పాల్గొని, 55 కేజీల విభాగంలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మోడల్ సాధించాడు. అద్భుతమైన ప్రతిభ కనబరిచిన రామ్‌కి పలువురు అభినందనలు తెలియజేసారు.

ఇంటర్ వర్సిటీ ఖోఖో పోటీలకు ఎంపిక

అనకాపల్లి : స్థానిక డైట్ కళాశాల విద్యార్థిని బి.అలేఖ్య(బీటెక్ ద్వితీయ సంవత్సరం) ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకూ చెన్నైయి సెంట్రల్ యూనివర్సిటీలో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక జాతీయ రహదారి కళాశాలలో అలేఖ్యను సోమవారం అభినందించి మాట్లాడారు. ఈనెల 16, 17 తేదీల్లో జెఎన్‌టీయూ విజయనగరంలో జరిగిన అంతర్ కళాశాలల ఖోఖో పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి, అంతర్ విశ్వ విద్యాలయాల పోటీలకు ఎంపికై నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, ఫిజికల్ డైరెక్టర్ బీహెచ్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బి.అలేఖ్య, బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని

నేషనల్ బాక్సింగ్ పోటీలకు కృష్ణవేణి



నర్సీపట్నం : ఈ నెల 21 నుండి 26 వరకు ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న 7వ సీనియర్ నేషనల్ బాక్సింగ్ పోటీలకు ఏపీ జట్టు తరుపున నర్సీపట్నానికి చెందిన కోలుకుల కృష్ణవేణి ఎంపికైంది. 66 కిలోల సీనియర్ విభాగం ఉమెన్ కేటగిరిలో ఆమె పోటీల్లో పాల్గొనుంది. ఇటీవల విశాఖలో జరిగిన సీనియర్ స్టేట్ బాక్సింగ్ పోటీల్లో కృష్ణవేణి గోల్డ్‌మెడల్ సాధించి, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిందని కోచ్ అబ్బు తెలిపారు. కృష్ణవేణిని పలువురు అభినందించారు.

రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు గురుకుల విద్యార్థులు

నర్సీపట్నం: ఎంజేపీ ఏపీ బీసీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికయ్యారు. టెన్ని కాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం, లంకపాలెం జెడ్పీ హైస్కూల్లో ఈ నెల 17న జరిగిన జిల్లా స్థాయి టెన్నికోయిట్ పోటీల్లో వీరు పాల్గొన్నారు. ఎంజేపీ బాలుర గురుకులం విద్యార్థులు టి.వి.కె.అప్పారావు, ఆర్.గురుచరణ్ సీనియర్ పురుషుల విభాగం, సబ్ జూనియర్ విభాగంలో పి.మణికంఠ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లా పలాసలో జరగనున్న రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొనున్నారు. ఆయా విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్‌ను ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరెడ్డి

వరల్డ్ యోగ పోటీల్లో సత్తాచాటిన ఉపాధ్యాయిని

నర్సీపట్నం: యూనివర్సల్ యోగ స్పోర్ట్స్ ఫెడరేషన్ వారు ఈనెల 16న న్యూఢిల్లీలో 2023 అంతర్జాతీయ యోగ కప్ పోటీలు నిర్వహించారు. 45 నుంచి 50 వయస్సు కలిగిన ఉమెన్ కేటగిరీలో నర్సీపట్నానికి చెందిన ఉపాధ్యాయిని విజయనిర్మల పాల్గొన్నారు. అంతర్జాతీయ మహిళా విభాగంలో విజయనిర్మల అద్భుతమైన ప్రతిభ కనబరిచి ప్రథమస్థానంలో నిలిచారు. ఆమె పాయకరావుపేట జెడ్పీహైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ నర్సీపట్నంలో నివాసం ఉంటున్నారు. ఉపాధ్యాయినిగా విద్యార్థులను తీర్చిదిద్దుతూ, జాతీయ, అంతర్జాతీయస్థాయి యోగా పోటీల్లో మెడల్స్ సాధిస్తూ యోగా క్రీడాకారిణిగా పలువురి మన్ననలు పొందుతున్నారు.



పతకం అందుకుంటున్న ఉపాధ్యాయిని విజయనిర్మల

కిక్ బాక్సింగ్ పోటీల విజేత విశాఖ జట్టు

గాజువాక : న్యూ కిక్ బాక్సింగ్ సంఘం ఆధ్వర్యంలో గాజువాకలో నిర్వహించిన 13వ రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో విశాఖ జట్టు మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. రెండో స్థానాన్ని అనకాపల్లి జట్టు, మూడో స్థానాన్ని కాకినాడ జట్టు సొంతం చేసుకున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి విజేతలకు ట్రోఫీ, బహుమతులను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ క్రీడల్లో రాణించేవారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రతిరోజు క్రీడలను సాధన చేసేవారు మంచి ఆరోగ్యాన్ని కూడా సొంతం చేసుకుంటారన్నారు. కిక్‌బాక్సింగ్ సంఘం గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు వచ్చేనెలలో ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సిరట్ల శ్రీనివాస్, ఎస్ఐ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి


ఎన్నికల ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష

తుమ్మపాల: ఓటర్ల జాబితా తయారీ, మార్పులు చేర్పులు, తొలగింపులు చేస్తున్నామని, పోలింగ్ కేంద్రాల తనిఖీ చేసి వాటి పరిస్థితిని బట్టి తగిన చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా కలెక్టర్లు, ఎస్పీలతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ముందస్తు ఏర్పాట్ల గురించి సమీక్షించామన్నారు. ఈ నెల 22, 23 తేదీలలో జరిగే కేంద్ర ఎన్నికల కమిషన్ సమావేశానికి అన్ని రికార్డులు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూముల ఏర్పాటు, పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించడం జరిగిందన్నారు. జిల్లా నుంచి ఆయనతో పాటు పోలీసు సూపరింటెండెంట్ కె.వి.మురళీకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి బి. దయానిధి, సీపీఓ జి.రామారావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ లక్ష్మీదేవి, డీటీ రవికుమార్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ నిర్వహణ పద్ధతులు పారదర్శకం

ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్వహణ పద్ధతులు పూర్తిగా పారదర్శకం, నైతికమైనవని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తెలిపింది. కార్మిక సంఘాల ఆరోపణల నేపథ్యంలో సోమవారం యాజమాన్యం ప్రకటన విడుదల చేసింది. స్టీల్‌ప్లాంట్ బలమైన, పారదర్శకమైన కొనుగోలు విధానం, నాణ్యత నియంత్రణ వ్యవస్థ కలిగి ఉందని తెలిపింది. ఉత్పత్తుల తయారీ ప్రక్రియలో కఠినమైన నాణ్యత తనిఖీల కారణంగా దేశీయ, ఎగుమతి మార్కెట్ రెండింటిలో స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తులు అత్యధిక నాణ్యతకు ప్రసిద్ధి చెందాయని పేర్కొంది. స్టీల్‌ప్లాంట్ టర్న్ అరౌండ్ సాధించడానికి, నగదు లాభాలు పొందడానికి, ఉత్పత్తి సామర్థ్యం సాధించడం అత్యవసరమని తెలిపింది. ఇందుకు సంబంధించి వ్యూహాత్మక ప్రణాళిక సిద్ధం చేయడమే కాకుండా ఉక్కు అధికారులు, కార్మిక సంఘాలతో చర్చించినట్లు స్పష్టం చేసింది. ఇందులో భాగంగా ఈనెల 30న బీఎఫ్-3ను ప్రారంభించాలనే ప్రణాళికతో సంస్థ ముందుకు సాగుతుందని సంస్థ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ ప్రతినిధి తెలిపారు.

తెప్ప బోల్తా పడి మత్స్యకారుడి మృతి



మృతి చెందిన నూకరాజు

ఎస్.రాయవరం : రేవుపోలవరం తీరంలో సముద్రంలోనికి చేపల వేటకు వెళ్లే సమయంలో కెరటాలకు తెప్ప బోల్తాపడి మత్స్యకారుడు మృతి చెందాడు. ఘటనపై తోటి మత్స్యకారులు అందించిన సమాచారం మేరకు వివరాలివి. కొత్త రేవుపోలవరం గ్రామానికి చెందిన బొడ్డు నూకరాజు(50), చోడిపల్లి తాతీయ్యలు, దానయ్య, కోరాడ నాగరాజు కలిసి తెప్పపై తెల్లవారు జామున చేపల వేటకు వెళ్లారు. తీరంలోనికి వెళ్లే సమయంలో కెరటాల తాకిడికి తెప్ప బోల్తా పడడంతో నూకరాజు నీటిలో మునిగిపోయాడన్నారు. తోటి మత్స్యకారులు అతడిని బయటకు తీసేందుకు ప్రయత్నించినా అప్పటికే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందడంతో ఎస్.రాయవరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



మహలక్ష్మి మృతదేహం

చోడవరం (రూరల్): చోడవరంలో మామిడిపాక మహలక్ష్మి అనే వివాహిత సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. మహలక్ష్మికి మామిడిపాక శ్రీనివాస్‌తో 13 ఏళ్ల క్రితం వివాహం అయింది. వీరికి ధనుష్(11) హర్ష లక్ష్మణ్(10) అనే ఇద్దరు పిల్లలున్నారు. భర్త తాగుబోతు కావడం, ఇంటి బాధ్యతలు పట్టించుకోకపోవడంతో మహలక్ష్మి మానసిక ఒత్తిడికి గురై విష పదార్థం సేవించింది. ఆమె మృతి చెంది బాత్‌రూం వద్ద పడి ఉండడంతో పొరుగువారు చూసి మృతురాలి తల్లి పార్వతికి సమాచారం ఇచ్చారు. ఆమె వచ్చి విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సీఐ శ్రీనివాసరావు విలేకరులకు తెలిపారు.

కడుపు నొప్పి తాళలేక...

మాడుగుల రూరల్: మాడుగుల జగ్గన్న చావిడి ప్రాంతానికి చెందిన వివాహిత సోమవారం ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్ఐ పి. దామోదర్‌నాయుడు తెలిపారు. ఆదివారం రాత్రి రెడ్డి మరియ (38) అనే వివాహిత కడుపునొప్పి తాళ లేక ఆదివారం రాత్రి తన ఇంట్లో ఉరేసుకుంది. ఇది గమనించి కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలికి భర్త పైడిరావు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విలేకరులకు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి



సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అప్పారావు సత్యవేణి దంపతులు

అనకాపల్లి: పట్టణం, మండలంలోని పలు సుబ్రహ్మణ్యస్వామి దేవాలయాల్లో సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గవరపాలెం శ్రీ కామాక్షి అమ్మవారి ఆలయ ఆవరణలో సుబ్రహ్మణ్యస్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణాన్ని వ్యాపారవేత్త గొల్తి అప్పారావు సత్యవేణి, గొల్తి సతీష్ ధనలక్ష్మి దంపతులు నిర్వహించారు. అనంతరం కల్యాణంలో పాల్గొన్న భక్తులకు అన్న సమారాధన జరిపారు. ఈకార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్తుర్తి గంగారావు, పట్టణ సంఘం అధ్యక్షుడు కోటిపల్లి జేజిబాబు, కార్యదర్శి కొమ్మోజు రాజు, కోశాధికారి పొన్నాడ వెంకట నర్సింహచారి, భక్తులు పాల్గొన్నారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

అనకాపల్లి: జీవీఎంసీ విలీనగ్రామమైన 84వ వార్డు పరిధిలోని సిరసపల్లి, మండలంలోని ఊడేరు సచివాలయ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవిందలు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. పట్టణ, మండల సచివాలయాల కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని వారు కోరారు.

ఘనంగా మోదకొండమ్మ పండగ

అనకాపల్లి: స్థానిక గాంధీబొమ్మ జంక్షన్‌లో మోదకొండమ్మ అమ్మవారి పండగ సోమవారం ఘనంగా జరిగింది. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని వ్యాపారవేత్త కోరుకొండ కాశీ ప్రారంభించారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, మాజీ కౌన్సిలర్ కరణం శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాలిమేర భరణి, కోట్ని కొండలరావు, ఈశ్వరరావు, మొగ్గ శ్రీను కాయల ప్రసన్నలక్ష్మి, ప్రసాద్,భక్తులు పాల్గొన్నారు.


అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కోరుకొండ కాశీ

అయ్యప్ప ఆలయంలో ముగిసిన భిక్ష

మునగపాక : స్థానిక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భిక్ష కార్యక్రమం సోమవారంతో ముగిసింది. అక్టోబర్ 25న ప్రారంభమైన భిక్ష 55 రోజుల పాటు నిర్విరామంగా సాగింది. ఇందుకు సహకరించిన దాతలకు ఆలయ కమిటీ చైర్మన్ వేగి లక్ష్మణరావు, కార్యదర్శి సత్యనారాయణలు కృతజ్ఞతలు తెలిపారు. భిక్ష ఏర్పాటులో భాగస్వాములైన నిర్వాహకులు దాడి పోలీసు, జల్లేపల్లి కృష్ణారావును సత్కరించారు.

క్లుప్తంగా

ఘనంగా గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు



సారెను ఊరేగిస్తున్న మహిళా భక్తులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు పెరుగుబజార్ జంక్షన్ కుంచావారి గౌరీపరమేశ్వరుల అమ్మవారి సారె ఊరేగింపు సోమవారం ఘనంగా జరిగింది. పట్టణంలో వీధులు గుండా ఊరేగింపు నిర్వహించి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం.అబ్బులు మాట్లాడుతూ సుమారు 200 సంవత్సరాల చరిత్ర కలిగిన కుంచావారి గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని ఈనెల 23వ తేదీన నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అదేరోజు ఉదయం పట్టణం వీధుల్లో అమ్మవారి విగ్రహ ఊరేగింపు, సాయంత్రం నేలవేషాలు, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

నేడు అచ్చెర్లలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

కశింకోట: మండలంలోని అచ్చెర్ల సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. అధికారులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు హాజరు కావాలని వారు కోరారు.

భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక



భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలో విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో ఉన్న గాయత్రీ స్కూలు విద్యార్థులు జిల్లా స్థాయి భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అనకాపల్లిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో సీహెచ్ ఇందు, జి.మహామ్యా వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ బి.రామ్ కుమార్, ప్రిన్సిపాల్ వై.నగేష్ తెలిపారు. వీరు ఈ నెల 25 నుంచి విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. వీరితోపాటు మండల స్థాయి పోటీల్లో నలుగురు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారన్నారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

బీసీ కార్పొరేషన్లకు నిధులు విడుదల చేయాలి



డీటీ జయశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కర్రి రామకృష్ణ

అనకాపల్లిటౌన్: రాష్ట్రంలో బీసీ కులాల కార్పొరేషన్లకు నిధులు విడుదల చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కర్రి రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు కంచిపాటి వెంకట సన్యాసిరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు కోరారు. ఈ మేరకు స్థానిక ఉడ్‌పేట పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకూ సోమవారం ర్యాలీ నిర్వహించి, ఆర్డీవో కార్యాలయంలో డీటీ జయశ్రీకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చదరం నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొంతెన భక్తసాయిరాం, అలమండ శ్రీను, సైనిక్ సెల్ రాష్ట్ర కో కన్వీనర్ అగ్గాల హనుమంతరావు, స్థానిక నేతలు బొడ్డేడ నాగేశ్వరరావు, వేగి నాయుడు, వనం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నాడు: మారుమూల ఉగ్గినపాలెం వాసులకు ఏ ప్రభుత్వకార్యాలయంలో పనిపడినా మండల కేంద్రానికి వెళ్లవలసి వచ్చేది. రెండు మూడు కార్యాలయాల్లో పని ఉంటే ఆ ఆఫీసులు వేర్వేరు ప్రాంతాల్లో ఉండడంతో చాలా సార్లు తిరగవలసి వచ్చేది. దీంతో చేతిచమురు వదలడమే కాకుండా, చాలా సమయం ఆ ఒక్క పని కోసం వెచ్చించవలసి వచ్చేది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు.

నేడు: గ్రామంలోనే ఒకే ప్రాంగణంలో సచివాలయంతో పాటు పలు కార్యాలయాలను ఏర్పాటు చేయడంతో అన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయి. పక్కపక్కనే కార్యాలయాలు ఉండడంతో చాలా సులభంగా పనులు పూర్తవుతున్నాయని ఉగ్గినపాలెం వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- మారుమూల ఉగ్గినపాలెంలో ఒకే ప్రాంగణంలో కార్యాలయాలు
- అందుబాటులోకి అన్ని సేవలు
- గ్రామస్తులకు తప్పిన వెతలు



రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ భవనాలు

పల్లెవించిన ప్రగతి



ఉగ్గినపాలెంలో సచివాలయం, పంచాయతీ కార్యాలయాల భవనం



సంపద కేంద్రం



రక్షిత మంచినీటి పథకం

కశింకోట: సుమారు 3,500 మంది జనాభా ఉన్న మారుమూల గ్రామం ఉగ్గినపాలెం. గతంలో చాలా సమస్యలతో కొట్టుమిట్టాడిన పల్లె ఇది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ గ్రామం చాలా అభివృద్ధి చెందడమే కాకుండా ఒకే ప్రాంగణంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయడంతో అన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయి. గ్రామానికి కొత్త కళ వచ్చింది.

ఉగ్గినపాలెం సచివాలయం పరిధిలో పరవాడ పాలెం గ్రామ పంచాయతీ ఉంది. తన సొంత గ్రామం కావడంతో ఎంపీపీ కలగా లక్ష్మి, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రోత్సాహంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గ్రామానికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలో సుమారు రూ.కోటి వ్యయంతో అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలు ఏర్పాటు చేశారు.ఇతర సచివాలయాలకు ఆదర్శంగా నిలిచేలా అభివృద్ధి చేశారు.

అన్నీ ఒకే చోట...

పంచాయతీ, సచివాలయ కార్యాలయాలను ఒకే భవనంలో కింద, పై అంతస్తుల్లో ఏర్పాటు చేశారు. వాటి వెనుక భాగంలో రైతు భరోసా కేంద్ర భవనం, దాన్ని ఆనుకొని వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ నిర్మించారు. ఆ పక్కనే అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం, సంపద కేంద్రం, రక్షిత మంచినీటి పథకాన్ని నిర్మించారు.

ఊరు బాగుపడింది..

రూ.18 లక్షలతో నాడు–నేడులో పాఠశాలను అభివృద్ధి చేశారు. సుమారు రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. గ్రామంలో చాలా కాలంగా అసంపూర్తిగా నిలిచిపోయిన కల్యాణ మండపాన్ని తాజాగా అరబిందో పరిశ్రమ సహకారంతో రూ.25 లక్షలతో నిర్మించారు. గతంలో ప్రభుత్వ సేవల కోసం, విత్తనాల కోసం కశింకోటలో మండల కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. వైద్యం కోసం తాళ్లపాలెం, కశింకోట, అనకాపల్లి వంటి ప్రాంతాలకు పరుగుపెట్టవలసి వచ్చేది. ఇప్పుడు స్థానికంగానే అన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయి ప్రభుత్వ సేవలను అతి చేరువ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు, రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

చేరువలో సేవలు



మా ఊరిలో గతంలో కేవలం పంచాయతీ కార్యాలయం మాత్రమే ఉండేది. సచివాలయ వ్యవస్థ ఏర్పడిన తర్వాత సచివాలయ కార్యాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, సంపద కేంద్రం వగైరా అందుబాటులోకి వచ్చాయి. వీటిని ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. అతి చేరువలో సేవలందుతుండటం ఎంతో ఆనందంగా ఉంది. ఎక్కువ ప్రభుత్వ కార్యాలయాలు రావడంతో గ్రామం కూడా ఎంతో అభివృద్ధి చెందుతోంది.

–వవ్వల సీతారాముడు, ఉగ్గినపాలెం

శ్రమ తప్పింది



మా గ్రామంలో సచివాలయాన్ని ఏర్పాటు చేసిన తర్వాత ప్రభుత్వ సేవలు చేరువలోకి వచ్చాయి. గతంలో ప్రభుత్వ సేవల కోసం వ్యయ ప్రయాసల కోర్చి కశింకోటలోని మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు గ్రామంలోనే సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ తదితర వాటిని ఏర్పాటు చేసి విస్తృతంగా సేవలందిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

–ఊసా రమణ, ఉగ్గినపాలెం

ఆదర్శ గ్రామంగా..



ఉగ్గినపాలెం గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నాం. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సహకారంతో ఎన్నడూ లేని విధంగా గత నాలుగున్నరేళ్లలో దాదాపు రూ.కోటిన్నరతో అభివృద్ధి చేశాం.

–కలగా గున్నయ్యనాయుడు, సర్పంచ్, ఉగ్గినపాలెం.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం



వెంకుపాలెంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న బొడ్డేడ ప్రసాద్, దిలీప్‌కుమార్



సిరసపల్లిలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న మందపాటి జానకీరామరాజు



తాళ్లపాలెం-2 సచివాలయంలో సంక్షేమ బోర్డు ఆవిష్కరించిన్న ఎంపీపీ కలగా లక్ష్మి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

అనకాపల్లి: అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యత ఇస్తూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జిల్లా బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. మండలంలో వెంకుపాలెం సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత మనఅందరిపై ఉందన్నారు. ఏపీఐడబ్ల్యూఏ రాష్ట్ర చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ అన్ని హామీలను నెరవేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అంతకుముందు సచివాలయం పరిధిలో రూ.35,84,78,395 తో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలతో కూడిన డిస్‌ప్లేబోర్డును ఆవిష్కరించారు. ప్రధాన కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, బ్రోచర్‌ను ప్రజలకు అందజేసి, పల్లెనిద్ర చేశారు. గ్రామంలో దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, దంతులూరి దిలీప్‌కుమార్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, సర్పంచ్‌లు రాపేటి నాగేశ్వరరావు, సుంకర చంటి, బాదపు లక్ష్మీ తాతారావు, ఎంపీటీసీ రాపేటి వెంకటేష్, సచివాలయం కన్వీనర్లు రాపెటి అప్పలనాయుడు, కొత్తపల్లి శ్రీను, పొలమరశెట్టి నర్సింగరావు, దాడి వెంకటరావు, ఈవోఆర్డీ కె.ధర్మారావు, సచివాలయం ఉద్యోగులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, లబ్ధిదారులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సిరసపల్లిలో...

ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్‌సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పుడు మన రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఇబ్బందులు పడకూడదని సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అన్నారు. జీవీఎంసీ విలీనగ్రామమైన సిరసపల్లిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం అభివృద్ధి పనుల డిస్‌ప్లేబోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ నేతలు కరణం సురేష్, ఈగల మహేష్, సేనాపతి లక్ష్మీ, గైపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: మారుమూల గ్రామాలు సైతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చెందాయని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. మండలంలోని తాళ్లపాలెం-2 సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఒక్కో సచివాలయ పరిధిలోని గ్రామాల్లో రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్లు, డ్రైన్లు, సామాజిక భవనాలు నిర్మించినట్టు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, వైఎసార్‌సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, వైఎస్సార్ సీపీ నాయకులు లగిశెట్టి గణేష్, ఇందల ముసిలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం



సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కశింకోట: స్థానిక కోనేరు వద్ద గల సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో సోమవారం స్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవ పంచలోహ విగ్రహాలను అందంగా అలంకరించి శాస్త్రోక్తంగా వేద పండితుడు వెంకటరమణమూర్తి, ఆలయ అర్చకుడు గోపాలకృష్ణ కల్యాణం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎస్.వీరన్న సాయికుమార్‌రెడ్డి, హిమజ దంపతులు కల్యాణాన్ని జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని ఆలయంలో స్వామికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్థానిక శివాలయంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో అర్చకులు వి. చిదంబరం, వి.కృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

కిక్ బాక్సింగ్ పోటీల విజేతలకు అభినందన



కిక్ బాక్సింగ్ క్రీడాకారులను అభినందిస్తున్న మళ్ల సురేంద్ర

తుమ్మపాల: గాజువాకలో ఈ నెల 17న జరిగిన 13వ స్టేట్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్– 2023 పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు మళ్ల సురేంద్ర సోమవారం అభినందించారు. కిక్ బాక్సింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన షేక్ జాస్మిన్, మార్ని పవన్, సింగంపల్లి శృతి, టంగుటూరి శాంతి, అంగారపు హేమంత్, ఆళ్ల నాయక్ ప్రతిభ చూపి జనవరి 1న ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ ఐతా లక్ష్మణ తెలిపారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న శకుంతల, సుమమణి

తుమ్మపాల: అభిరుచి మేరకు పిల్లలు విభిన్న రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని జిల్లా సమన్వయ అధికారి శకుంతల అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామం కొప్పాక జెడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్ భవిత కేంద్రంలో నిర్వహించిన ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో 60 మంది విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సుమమణి, జెడ్పీహెచ్ఎస్ మామిడిపాలెం ప్రత్యేక ఉపాధ్యాయులు బి.వి.వరప్రసాద్, మండల ఐఈఆర్‌పీ టీచర్లు యేసు రత్నం, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



తేగాడ ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న దాడి రత్నాకర్

కశింకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు వినియోగించుకుని అభ్యున్నతికి బాటలు వేసుకోవాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ కోరారు. మండలంలోని తేగాడ వద్ద ఉన్న ప్రభుత్వ ఆదర్శ పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నాడు-నేడు కింద కల్పించిన వసతులను, పాఠశాల నిర్వహణ తీరును పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. తరువాత జోగారావుపేటలో పర్యటించి, చెరకు రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు వేగి దొరబాబు, పార్టీ ప్రతినిధులు లోవ అప్పారావు, అల్లం మాణిక్యం, కొత్తపల్లి నూకరాజు, ఎస్.గోపాల్, ఎం. సత్తిబాబు,ఎస్. రాము, ఎం శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో ధరణేష్‌కు రజత పతకం



ధరణేష్‌కు రజత పతకాన్ని అందజేస్తున్న పోటీల నిర్వాహకులు

తుమ్మపాల: పట్టణంలో ఈ నెల 17న జరిగిన మిస్టర్ ఆంధ్ర–2023 రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో అనకాపల్లి పట్టణానికి చెందిన ఎస్.ఎస్.ఎస్. సేవా సంఘం జిమ్ క్రీడాకారుడు ధరణేష్ 80 కిలోల పైబడిన విభాగంలో రజత పతకాన్ని సాధించాడు. పోటీల్లో ప్రతిభ చూపి ధరణేష్ పతకం సాధించడం పట్ల ఎస్.ఎస్.ఎస్. సేవాసంఘం జిమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, జిల్లా పవర్ లిఫ్టింగ్ ప్రధాన కార్యదర్శి బద్రినాథ్, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ చైర్మన్ కాండ్రేగుల శ్రీరామ్ హర్షం వ్యక్తం చేశారు.

పాడి రైతులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న పశు వైద్యాధికారి చైతన్యమణి

కశింకోట: జగనన్న పాల వెల్లువ ద్వారా పాడి రైతులకు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నరసింగబిల్లి పశు వైద్యాధికారి చైతన్యమణి కోరారు. కశింకోట మహిళా సమాఖ్య కార్యాలయంలో జగనన్న పాల వెల్లువ ద్వారా అమూల్ డెయిరీకి పాలు ఉత్పత్తి చేస్తున్న స్వయం సహాయక సంఘాల మహిళా రైతులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ ప్రాజెక్టులో భాగంగా అమూల్ డెయిరీ పాడి రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు, బోనస్ అందివ్వడంతో పాటు బీమా సదుపాయం, పశుగ్రాసం సరఫరా తదితర సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. కశింకోట పశు వైద్యాధికారి అల్ఫాన్సా జార్జ్, మహిళా సమాఖ్య కోశాధికారి జి. పార్వతి, వెలుగు ఏపీఎం ఎస్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై విశేష పూజలు



సింహాచలం: సింహగిరిపై సోమవారం ధనుర్మాస పూజలను ఘనంగా నిర్వహించారు. విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, ఉపనిషత్తు పారాయణం, తిరుప్పావై సేవాకాలం అనంతరం గోదాదేవికి బేడా మండపంలో తిరువీధిని వైభవంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు పవన్‌కుమార్ తదితరులు ఈ పూజలను నిర్వహించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పగల్‌పత్తు ఉత్సవాలు ఆరో రోజు సోమవారం విశేషంగా జరిగాయి. భక్తులు స్వామి నామస్మరణలో మునిగితేలారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి పల్లకీలో అధిష్ఠింపజేసి ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆస్థాన మండపంలో అధిష్ఠింపజేసి దివ్యప్రబంధపారాయణాలు పఠించారు.

వెంకన్న ఆలయంలో....

కొండదిగుడ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి సన్నిధి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు భార్గవ్ తదితరులు ఈపూజలు నిర్వహించారు.

సాంబమూర్తి ఆలయంలో దీపార్చన

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శివారు బంగారయ్యపేటలో సాంబమూర్తి ఆలయంలో గౌరీపరమేశ్వరుల (గౌరమ్మ) విగ్రహం వద్ద సోమవారం దీపార్చన నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించి, పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు లగిశెట్టి గణేష్, చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు ఆంధ్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


అనకాపల్లి సినిమాలు

జోరుగా హుషారుగా:	రాజా
ఎక్స్‌ట్రా	: సత్యనారాయణస్క్రీన్-1
-------	: సత్యనారాయణస్క్రీన్-2
యానిమల్	: షిర్డిసాయి
హాయ్ నాన్న	: పర్తిసాయి
మంగళవారం	: వెంకటేశ్వర
తికమక తాండ	: శ్రీసత్య
పిండం	: రామచంద్ర

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 379 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 251 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 2,296 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,600	4,990
మొదటి రకం	4,080	4,520
రెండో రకం	3,970	4,250
మూడోరకం	3,880	4,160

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 12 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బి పాజిటివ్-3 యూనిట్లు, బి నెగిటివ్-1 యూనిట్, ఒ పాజిటివ్-4 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

అంగన్‌వాడీల ర్యాలీ

అనకాపల్లి: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకూ సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో డీటీ జయశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి మజ్జి నాగశేషు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. శంకరరావు, జిల్లా నాయకులు కె.కాసులమ్మ, కె.రామలక్ష్మి, కె.తనుజ, బి.జయలక్ష్మి, కె.కృష్ణవేణి, భవానీ, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.మాణిక్యం పాల్గొన్నారు.

సరిపల్లిలో చైన్ స్నాచింగ్

పెందుర్తి: మండలంలోని సరిపల్లిలో సోమవారం చైన్ స్నాచింగ్ జరిగింది. బాధిత మహిళ తెలిపిన వివరాలు ప్రకారం...సరిపల్లిలో గంజి నారాయణమ్మ ఇంటి ముందు కూరగాయల వ్యాపారం చేస్తోంది. మధ్యాహ్నం ఇద్దరు బైకుపై వచ్చి గుర్రంపాలేనికి వెళ్లే దారి ఎటువైపు అని నారాయణమ్మను అడిగారు. ఆమె ఎటువైపు వెళ్లాలో సూచిస్తున్న సమయంలోనే మెడలో ఉన్న సుమారు 5తులాల బంగారు గొలుసు లాక్కుని బైక్‌పై పారిపోయారు. బాధితురాలు అరవడంతో చుట్టుపక్కల వాళ్లు వచ్చి చూసినప్పటికే ఉడాయించారు.